# చేతిలో వెన్నముద్ద

బాతాఖానీకి ఆనందం కూడా ఊళ్ళో లేదు. రేడియోకి సుస్తీ చేసి విశ్రాంతి తీసుకొంటూంది.

అప్పుడే భోజనం చేసి ఆరుబయట వెన్నెల్లో పడక కుర్చీలో పడుకున్నాను.

ఏం చేయటానికీ పాలుపోవటం లేదు.

నేను తీరుబడిగా కూర్చోటం కనిపెట్టింది గాబోలు మా చిన్న అమ్మాయి ఇందిర వచ్చి చంద మామ కేసి చూస్తూ నా ఒళ్ళో పడకవేసింది.

రి వాళ్ల పిల్లలకయితే చదువు చెపుతారు గాని ఇంట్లో పిల్లల చదువు విషయమే పట్టించుకోరని, మా పెద్దవాడి అక్షరాభ్యాసం నాటినించీ కూడా నా మీద కారాలు మిరియాలు నూరటం మా శ్రీమతికి అలవాటయింది.

శ్రీమతిని సంతృప్తి పరిచినట్లుగానూ ఉంటుంది. కాలక్షేపమూ అవుతుందని ఒక సాహస కార్యానికి పూనుకున్నాను. అదే మా అమ్మాయికి పద్యం చెప్పటానికి ప్రయత్నించటం.

మా నాన్నగారు చిన్నప్పుడు నాకు ఆ పద్యం చెప్పేరు. మా తాతగారు కూడా మా నాన్నగారికి ఈ పద్యం చెప్పేరట చిన్నతనంలో.

క్లాసులో పాఠం చెప్పటమనేది ఈ రోజులలో చాలా గడ్డుపని. విద్యార్థులకి ఎన్నెన్నో సందేహాలు వస్తూ ఉంటాయి. వీటిలో చాలా భాగం పాఠ్య భాగానికి సంబంధించనివి అవటం గొప్ప విశేషం.

మా చిన్న అమ్మాయికి పద్యం చెప్పటంలో ఈ బాధలు ఉండవనే ధీమాతో "తల్లీ, పద్యం చెప్పుకుంటావా ?" అన్నాను.

ఏ కళన ఉందో, "చెప్పు నాన్నా," అంది.

ఆమె సంబోధనలలో ఏకవచన ప్రయోగాలు ... తి పద్ధతిలో ఉండవు.

సరే ఉపక్రమించాను.

"చేతులో అను అమ్మా" అన్నాను. ఆమె అలాగే పలికింది.

"వెన్నముద్ద," అనమన్నాను.

"ఛీ ! వెన్నముద్ద ఏమిటి ? పెరుగుముద్ద అనాలిగాని అమ్మనాకు చేతులో వెన్నముద్ద పెడుతుందేమిటి— పెరుగుముద్ద పెడుతుంది గాని—" అడుగులోనే హంసపాదు.

"కాదమ్మా, ఈ పద్యం రాసిన ఆయన వెన్నముద్ద అనే రాశాడు. అందుచేత వెన్నముద్ద అనే చెప్పుకోవాలి తల్లీ," అన్నాను. నా సలహా పాటించబడింది.

"చెంగల్వ" అనమన్నాను. "చెంగల్వ అంటే ఏమిటి నాన్నగారూ ?" అంది.

"నాకూ తెలియదు. కలువలు అంటే మా ఊళ్ళో చెరువులో చూశాను గాని చెంగల్వలంటే ఎలా ఉంటాయో మరి. అవి ఒకరకం పువ్వులే అమ్మా !" అని దాటేశాను.

పూదండ— చెన్ని అనిపించాను.

ప్రారంభించిన వేళా విశేషం మంచిదని ఆనందించాను.

"బంగారు"— మా అమ్మాయికి 'ర' పలకదు ప్రాజ్ఞులు గ్రహించే ఉంటారు. 'బంగాడు' అంది.

గతంలో నేను అంత శ్రమ తీసుకోలేదు 'ర', 'డ'ల రగడను గురించి నాన్నగాడూ, ఒడేయ్ అనే సంబోధనలు నాకు చిర పరిచితాలే.

'ర' పలికించకపోతే ఇంక 'డ' అనే అలవాటు అవుతుందేమోనని, కొంచెం శ్రమ పడదామనుకున్నాను.

'నీరు' అనమన్నాను. 'నీడు' అంది.

ద్విత్వాక్షరమైతే ఎలా పలుకుతుందో తెలుసుకుందామని 'క్ర' అనమన్నాను. సరిగానే పలికింది.

ధైర్యం కలిగింది. 'వారు' అనమన్నాను 'ర' వత్తి పలుకుతూ, 'వాడు' అంది స్పష్టంగా.

## యస్.కె.యస్. రామానుజాచారి

పరాజయాన్ని ఒప్పుకుని పద్యం కొనసాగించాను. 'మొలతాడు' అన్నాను. "ఇదిగో నా మొలతాడు— ఉంది" అని తన మొలతాడు చూపించింది.

'మొలతాడు' అను అమ్మా అన్నాను.

"నీ మొలతాడు ఏది నాన్నా, ఉందా ?"— ఎదరు ప్రశ్న.

"ఉంది గాని పద్యం చెప్పుకో తల్లీ— 'మొలతాడు' అనుతల్లీ !" అన్నాను.

"చిన్నన్న మొలతాడు తెంపేసుకున్నాడు నాన్నగాడూ— నిన్న పోటుగొప్పుడు నాడిని అమ్మ కొప్పడింది కూడాను. నేను చూడు నాన్నా— మొలతాడు పాడేసుకున్నానా— వాడు మంచివాడు కాదు— కాదూ" అంది.

నాలో సహనశక్తి కొంచెం సన్నగిలింది. కొంచెం గట్టిగా 'మొలతాడు' అను ! అన్నాను. ఇంకా ఎంత పద్యం ఉందో అని లోపల లోపల చదువుకుని పరుగు పందెంలో పాల్గొన్నవాడు ఆయాసం వచ్చాక గమ్యస్థానం ఇంకా ఎంతదూరం ఉందో అని చూసినట్లు.

నిరుత్సాహమే కలిగింది.

'మానవుడు ఏ పరిస్థితిలోనూ హార్పను కోల్పోరాదు' అనేది ప్రధానమైన నీతిసూత్రాలలో ఒకటి.

నెమ్మదిగా సనుదాయింపు స్వరంతో "బంగారు మొలతాడు" చెప్పుతల్లీ అన్నాను.

"నిన్నికి అసలు మొలతాడే లేదు నాన్నా"— సుపుత్రి ఉవాచ.

మొలతాడు గాధ అదేదో ఊరి తాంతాడు వ్యవహారం కింద మారుతూంది.

తమాయించుకుని "గబగబ పద్యం చెప్పుకో అమ్మా— నిద్రపోదువుగాని — 'పట్టుదట్టి'" అనమన్నాను.— మొలతాడు అని అన్నట్టే భావించుకుని.

ఇలాటి చిత్ర విచిత్ర భావనలు ఉపాధ్యాయ వృత్తిలో తప్పవు.

మాకో మేష్టరుగారు ఉండేవారు. పాఠం చెప్పి ప్రశ్నలు అడిగేప్పుడు ఏ ప్రశ్నకైనా నలుగురు అయిదుగురు తెలివిగలవాళ్ళు సరైన జవాబు చెప్పలేకపోతే ఆయన ఒక తమాషా చేసేవారు. ఎక్కడో వెనకాల బల్లమీద నించి బితుకు బితుకుమంటూ చూస్తూన్న కుర్రవాణ్ణి జవాబు చెప్పమనే వారు. వాడు ఏదో గొణిగేవాడు. వెంటనే ఆయన "శెభాసు. మీరు చెప్పలేక పోయారు. అతను చెప్పేడు చూడండి" అని ఆయనే గట్టిగా సరైన జవాబు చెప్పేసి ఇంకో విద్యార్థి చేత చెప్పించేవారు. కాని ఈ అస్త్రం చాలా అరుదుగా ప్రయోగించేవారు.

"పట్టుదట్టి" అని మళ్లీ ప్రారంభించేసరికి ఇందిరా ప్రియదర్శిని ఆవులు కొడుతూ నిద్ర పోతూంది.

పాపవాళ్ళ అమ్మ పక్కమీదకి— పట్టుదట్టి చిన్ని కృష్ణమ్మ దగ్గరకూ— పద్యగాథ పత్రికకి.

★

